


మౌలాలికి వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూ క్యాంపస్ పీజీ కళాశాల అర్థిక శాస్త్ర పరిశోధక విద్యార్థి మౌలాలికి యోగివేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. మౌలాలీ వైవీయూ అర్థికశాస్త్ర శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.గణేష్ నాయక్ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆఫ్ లేబర్ వెల్ఫేర్ ప్రాక్టీసెస్ ఇన్ సెలెక్టెడ్ ఇండస్ట్రీస్ ఆఫ్ కర్నూల్ డిస్ట్రిక్ట్' అనే అంశం పైన పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వ విద్యాలయానికి సమర్పించారు. మౌలాలికి వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు డాక్టరేట్‌ను అందజేశారు. పరిశోధకుడు రాసిన రెండు పరిశోధన పత్రాలు జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. పలు జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. ఈయన ఐసిఎస్ఎస్ఆర్, న్యూఢిల్లీ నుంచి ఫెలోషిప్ పొందారు. డాక్టరేట్ అందుకున్న మౌలాలిని ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కుల సచివులు ఆచార్య పి పద్మ, ఆర్థికశాస్త్ర అధ్యాపకులు, స్కాలర్ తల్లిదండ్రులు అభినందించారు.

పల్లెకు పోదాం.. చలో చలో..



- వరుస సెలవులతో సం'క్రాంతి'
- రహదారుల్లో భారీగా వాహన రద్దీలు
- 200 ఆర్‌టిసి బస్సులు కేటాయింపు
- సొంతూళ్లకు...పరుగులు

ప్రజాశక్తి-కడపప్రతినిధి

సంక్రాంతి నేపథ్యంలో పట్టణం పల్లెబాట పట్టింది. తెలుగింటి పెద్ద లపండుగ సంక్రాంతి. కాలగమనం మార్పులతో కూడిన సాంస్కృతిక పండుగను ఇంటిల్లిపాదీ కలిసి జరుపుకోవడానికి దేశంలోని నలుమూలల నుంచి పెద్దఎత్తున స్వగ్రామాలకు పరుగులు తీస్తున్నారు. డిసెంబర్ నుంచే బస్సులు, రైళ్లలో రిజర్వేషన్ చేసుకోవాలి. అలక్ష్యం వహిస్తే ప్రయాణం చేయడం అసాధ్యం. ముందస్తు ఆలోచన చేయకపోతే మరో ఏడాది వరకు వేచిచూడాల్సిందే. మూడు రోజుల ముందు నుంచే కొడుకులు, కోడళ్లు, నూతన వధూ వరులు సొంతూళ్లకు చేరుకోవడం పరిపాటి. ఈనేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా అదనపు రవాణా సౌకర్యాల నిమిత్తం చర్యలు తీసుకుంది.

జిల్లాలోని గ్రామసీమలకు సం'క్రాంతు'లు విరజిమ్ముతోంది. దీంతో దేశంలోని పట్టణాలు, నగరాలు సగానికిపైగా ఖాళీ అవుతున్నాయి. ఈనెల తొమ్మిదో తేదీ నుంచే పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు మొదలుకుని అధికారుల వరకు పల్లె బాట పట్టారు. ఫలితంగా పట్టణాలు, నగరాల్లోని గ్రామీణుల పిల్లలు, ఆత్మీయులతో కూడి ప్రయాణించడంతో వాహనాల రద్దీ పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాలైన చెన్నయ్, బెంగళూరు, ముంబయ్, హైదరాబాద్, ఢిల్లీ లాంటి ప్రధాన నగరాల నుంచి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. దేశంలోని ప్రధాన నగరాల్లోని గ్రామీణుల పిల్లలు సాఫ్ట్‌వేర్లు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, వివిధ రకాల ఉద్యోగాల్లో ఉంటున్నారు. వీరం దరూ పల్లెలకు ఒకేసారి బయల్దేరడంతో బస్సులు, రైళ్లు, ప్రయివేటు వాహనాలన్నీ రద్దీగా మారాయి.

చాలని..ఆర్‌టిసి

దేశంలోని నలుమూలల నుంచి పెద్దఎత్తున వచ్చే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఆర్‌టిసి యాజమాన్యం 232 అదనపు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం 174 బస్సు సర్వీసులను, సంక్రాంతి అనంతరం 190 స్పెషల్ సర్వీసులను నడుపు తోంది. ఇందులో సంక్రాంతి పండుగకు ముందు హైదరాబాద్‌కు 100, బెంగళూరుకు 70, చెన్నయ్‌కు 12, విజయవాడకు 25 చెన్నైయ్ 15, ఇతరములు 60 మొత్తం 270 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. సంక్రాంతి పండుగ అనంతరం హైదరాబాద్‌కు 100, బెంగళూరుకు 70, చెన్నయ్ 10, విజయ వాడకు 10 చొప్పున స్పెషల్ సర్వీసులను నడుపుతోంది. వీటితోపాటు తిరుపతి, కర్నూ లు, అనంతపురం తదితర పట్టణాల నుంచి ప్రత్యేక బస్సుల్లో నడుపుతుండడం గమనార్హం.

ప్రయి'వేటు'కు..!

దేశంలోని నలుమూలల నుంచి వచ్చే ప్రయాణికులను ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు దోచుకుంటున్నాయి. కడప నుంచి సుమారు 100 బస్సులు దక్షిణాది రాష్ట్రాల రాజధానులైన హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, రాజధాని కేంద్రమైన విజయవాడ పట్టణాలకు వెళ్తున్నాయి. జిల్లా నుంచి దేశంలోని ప్రధాన నగరాలకు వెళ్లే బస్సులు 500 సర్వీసులు నడుస్తున్నాయి. ప్రయివేటు ట్రావెల్స్ ద్వారా వెళ్లాలనుకునే సామాన్య ప్రయాణికుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తుండడంపై విమర్శల వర్షం కురిస్తోంది. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు ప్రయివేటు ట్రావెల్స్ నిర్వాహకులు స్లీపర్, నాన్‌స్లీపర్ పేర్లతో రూ.1,500 నుంచి స్లీపర్ రూ.1,000 నుంచి రూ.2,000 వరకు ఇష్టానుసారంగా టికెట్లు పెంచి నిలుదోపిడీ చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు గుడ్లప్పగించి చూ డడం మినహా చేసిందేమీ లేదు.

ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి 'మైనేని' : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మైనేని వెంకటరత్నం ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో మైనేని వర్ధంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. మైనేని ఐక్య ఉపాధ్యాయ పత్రిక మొదటి ప్రధాన సంపాదకులుగా పనిచేసి ఆనాటి ఉద్యమ తీరుతున్నలను ఉపాధ్యాయులకు చేరవేయడంలో ఐక్య ఉపాధ్యాయ పత్రికను వేదికగా తయారు చేశారన్నారు. మైనేని అందించిన స్ఫూర్తిని అందిపుచ్చుకొని నేడు ఐక్య ఉపాధ్యాయ పత్రిక రాష్ట్రంలో పెద్ద ఎత్తున పాఠకుల మన్ననలు పొందుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు సుజాత రాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్య మేరీ, నాయకులు పి.చంద్రశేఖర్, కేదార్నాథ్, సూర్య కుమార్, శివశంకర్ రెడ్డి, దేవదత్తం పాల్గొన్నారు.

యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప

యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలా వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితం, వారి ఉద్దేశాలు, సమాజం, యువత కోసం వారి సందేశాలు ను ఆదర్శంగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలు ఎదగవలెనని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు శివ రామకృష్ణ, రమేశ్ యాదవ్, అంకాల నాగరాజు, ఉపాధ్యాయులు డా. సుబ్బయ్య, డా. సుందరేశ్వర్, డా. హజరతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-చెన్నూరు



వాణి విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియంలో 1998-2000 సంవత్సరంలో చదివిన విద్యార్థిని విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదివిన స్కూల్‌లో ఉపాధ్యాయులకు పనిచేసిన టీచర్ సన్మానించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము వాణి విద్యా మందిర్ స్కూల్లో పనిచేయడం ఎన్నో విషయాలు తెలుసుకున్నామని చెప్పారు. విద్యార్థులు చలా మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అప్పటి స్కూల్ కరస్పాండెంట్ చీర్ల చెన్నయ్య యాదవ్, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, సి రవిశంకర్, సిద్దయ్య, పద్మనాభ రెడ్డి, హాయ్ సుబ్బారెడ్డి, కల్లూరు రవి శంకర్ రెడ్డి. సుబ్బయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, సులోచన కృష్ణవేణి ఉమాదేవి, తదితరులు పాల్గొని, విద్యార్థి బృందం చక్రపాణి, కపిల్ శీను, వెంకట కొండారెడ్డి, నాగార్జున, రాజశేఖర్, సుదర్శన్, కిషోర్ బాబు., కిషోర్ కుమార్ రెడ్డి, నర్మదా, కరి మునిసా, లావణ్య, హేమలత, హైమావతి, ఆదిలక్ష్మి, రామ తులసి తదితర విద్య విద్యార్థుల బృందం పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

ప్రజాశక్తి - కడపఅర్బన్ : గెలుపు ఓటములను సమానంగా స్వీకరించేందుకు క్రీడాకారులు మానసికంగా సిద్ధంగా ఉండాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను మున్సిపల్ క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద అనుసరించిన మార్గాన్ని యువత అలవర్చుకుని జీవితంలో ముందుకు ప్రయాణం సాగించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలోని అట్టడుగు క్రీడాకారుల సామర్థ్యాలను వెలికి తీసేందుకు భారత ప్రభుత్వ,నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి 20 టీములు వాలీబాల్ పోటీల కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. క్రీడా పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు ఉత్కంఠ భరితంగా ఆటను ఆస్వాదించారు. క్రీడలలో ఉన్నతమైన విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు మంచి మార్గం ఏర్పాటు అవుతుందని చెప్పారు. టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు, ట్రోఫీని అందించారు. కృషి, పట్టుదలతో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరు కష్టంతో పరితపిస్తారని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బ్రహ్మయ్య పేర్కొన్నారు

కోడి పందేలు వద్దు.. పండుగ ముద్దు..

ప్రజాశక్తి - కడప అర్బన్



సంక్రాంతి పండగ సంతోషంగా చేసుకోవాలని కడప సబ్ డివిజన్ పోలీసు అధికారి ఏ. వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి పండగ ప్రజలందరూ సంతోషకర వాతావరణంలో చేసుకోవాలని పేర్కొన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలందరికి పలు సూచనలు చేశారు. కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు ఎవ్వరు పాల్పడరాదని చెప్పారు. గతంలో సంక్రాంతి పండుగ సమయంలో కోడి పందేలు, జుదాలకు పాల్పడిన వారిపై గట్టి నిఘా పెట్టామని పేర్కొన్నారు. కోడి పందేలు, జుదాలు, పేకాట వంటి వాటిని ఆడిన, ఆడించిన వారిపై కేసులు నమోదైతే అట్టివారికి ఉద్యోగ అవకాశాలు, ఇతర దేశాలకు వెళ్లడానికి పాస్ పోర్ట్ వంటివి మంజూరు చేయడానికి వీలుకాదని తెలిపారు. పల్లెలో అక్రమముగా మద్యం అమ్మడం, బెల్టు షాపులు నిర్వహించడం, నాటు సార తాయారు చేయటం, అమ్మటం చేసే వారిపై గట్టి నిఘా పెట్టామని తెలిపారు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని చెప్పారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-అట్లూరు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని 12 గ్రామపంచాయతీలలో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట, వంటి జూదాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండగ సాంప్రదాయాలకు ప్రతీక, దాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో, సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్వహించుకోవాలన్నారు. ఎన్నో కుటుంబాల జీవితాలను నాశనం చేస్తాయని మన యువత అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలి అని ఎస్ఐ పేర్కొన్నారు.

అనంతపురంపై చిత్తూరు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఎ) అండర్- 12 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా చివరి రోజు ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఏసి ఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై ఐదు వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 35.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. ఆ జట్టులోన హేమ చంద్ర నాయక్ 47 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మోహిత్ సాయి మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 127 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 23.3 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసి ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్ లో కడప పై 9 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు 35.0 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 209 పరుగులు చేసింది. ఆ జట్టులోని యోగాంజనేయులు 52 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సమీర్ ఒక వికెట్ తీసుకున్నాడు. అనంతరం 210 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 210 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని మౌనిష్ 96, సోహన్ లతీక్ 58 పరుగులు చేశారు. కడప జట్టులోని తాహీర్ ఒక వికెట్ తీసుకున్నాడు.



తలపడుతున్న చిత్తూరు, అనంతపురం జట్లు

'సీమ'పై చిన్నచూపు తగదు

ఎపిజిబి తరలింపు నిర్ణయం రాజకీయ దుర్మార్గం
'అన్నీ అమరావతికేనా?' సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న శైలజనాథ్

రాయలసీమకు రావాల్సిన పరిశ్రమలు, సంస్థలు, ప్రాజెక్టులు ఇవ్వకుండా, ఇక్కడున్న సంస్థలను తరలించడాన్ని రాయలసీమ ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న ద్రోహమని, సీమ వాసులు సహించరని వక్తలు పేర్కొన్నారు. రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కడప ఐఎంఎ హాల్‌లో కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం 'అన్నీ అమరావతికేనా?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిసిసి మాజీ చైర్మన్ శైలజనాథ్, కన్వీనర్ డాక్టర్ సి. ఓబుల్‌రెడ్డి ఈ ఆయన మాట్లాడుతూ మంచి వ్యాపారం, సాంకేతిక సేవలు, లాభాలు, శాఖలు, కరెన్సీ చెస్ట్ సౌకర్యం వంటి వాటితోపాటు ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించాలనుకోవడం రాజకీయ దుర్మార్గమని చెప్పారు. దీనిపై మాజీ, ప్రస్తుత ప్రజా ప్రతినిధులు అంతా ఎవరి స్థాయిలో వారిలో ప్రతిఘటించాలని పేర్కొన్నారు. లేకపోతే చరిత్రలో దోషులుగా మిగిలిపోతామని తెలిపారు. పాలకులకు వెనకబడిన ప్రాంతాల పట్ల వారి బాధ్యతలను గుర్తుచేసే ప్రయత్నం చేస్తున్న రాయలసీమ పౌర సమాజాన్ని అభినందించారు. ఇక స్పందించాల్సింది నాయకులు పాలకులు మాత్రమేనని అన్నారు. ఎపి ఎస్‌సి, ఎస్‌టి లాయర్స్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కన్వీనర్ వై.జయరాజు మాట్లాడుతూ హైకోర్టు బదులు కర్నూల్‌లో బెంచ్ పెడతామంటూ అదేదో ఉద్ధరిస్తున్నట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఇది రాయలసీమ హక్కుల నిరాకరనే అన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం, ఉపాధి ఇలా అనేక దృష్టి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకుని కడపలోనే మిగిలిన తర్వాత కూడా రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించాలని తెలిపారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు జి.చంద్రశేఖర్, గాలి చంద్ర మాట్లాడుతూ ఎపిజిబి తరలింపుపై జరుగుతున్న అన్ని కార్యక్రమాలకు జిల్లా వ్యాప్తంగా తమ సంఘీభావం ఉంటుందన్నారు. సదస్సులో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, సిటిజన్స్ ఫోరం కన్వీనర్ లక్ష్మీ రాజా, ప్రైవేట్ కరస్పాండెంట్ అసోసియేషన్ నేత జోగిరామిరెడ్డి, టిఎంసి రామాంజనేయులు, మల్లెల భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాసులు రెడ్డి (సిఐటియు), నాగ సుబ్బారెడ్డి (ఎఐటియుసి), శ్రీనివాస్, అయ్యవారు రెడ్డి (ఇన్సూరెన్స్), అజీజ్, జగదీష్, ప్రసన్న (బ్యాంకింగ్), సుదర్శన్, శివశంకర్ (విద్యుత్), మహేష్ (ఉపాధ్యాయ), రామకృష్ణారెడ్డి (పెన్షనర్స్), వెంకటేశ్వర్లు, శివరాం (సైన్స్), ఓబులేసు (విద్యార్థి), రాజు (ఎన్జీవో), దస్తగిరి రెడ్డి (రైతు), న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు హాజరై ప్రసంగించారు.



సదస్సులో మాట్లాడుతున్న అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి

సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం

జిల్లా సాగు 77 శాతం
ఆశాజనకంగా బుడ్డశనగ, వరి పంటలు
జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

రబీ సీజన్ సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం. ఈఏడాది బుడ్డ శనగ, వరి పంటల దిగుబడులు ఆశాజనకంగా లభించే అవకాశం కనిపిస్తోంది. సానుకూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుతోపాటు ఆశావహంగా దిగుబడులు లభించే వాతావరణం నెలకొంది. ఇందులోభాగంగా జిల్లా సాధారణ సాగు లక్ష్యమైన 3,53, 180 ఎకరాలకుగానూ 2,59,952 ఎకరాల్లో విత్తనం పడింది. దీనికితోడు జిల్లాలోని కెసికెనాల్, బ్రహ్మంసాగర్ ఆయకట్టుకు సాగు నీరు అందుతున్న నేపథ్యంలో వరి సాగు మరింతగా ఊపందుకునే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 2025 రబీలో సాగు లక్ష్యాన్ని అందుకునే అవకాశం ఉంది. సీజన్ పాడవునా నార్త్ ఈస్ట్ పంటలైన నువ్వులు తదితర పంటలు సాగవుతున్న నేపథ్యంలో స్పష్టత కొరవడింది. ఈనేపథ్యంలో ఫిబ్రవరి నెలాఖరు నాటికి పంటల సాగుపై స్పష్టత లభించే అవకాశం ఉందని పేర్కొంటున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావుతో ముఖాముఖి...

రబీ సాగు గురించి తెలపండి?

2025 రబీసీజన్ ఆశావహంగా సాగుతోంది. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణమైన 3,53,180 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. ఈఏడాది రబీ సీజన్ మొదలు నుంచి నేటి వరకు సానుకూల వాతవరణ పరిస్థితుల నేపథ్యంలో 2,59,952 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. ఈలెక్కన సుమారు 77 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది. మిగిలిన 80 ఎకరాలకు పైగా విస్తీర్ణ ంలో పంటల సాగు కావాల్సి ఉంది. జనవరి, ఫిబ్రవరి చివరి నాటికి నువ్వులు, వరి, తదితర పంటల సాగుకు విత్తనం పడాల్సిన నేపథ్య ంలో లక్ష్యాన్ని అందుకునే అవకాశం ఉంది.

బుడ్డశనగ దిగబడులపై స్పందించండి?

జిల్లాలో బుడ్డశనగ సాగు విస్తీర్ణం 2,30 లక్షల ఎకరా లు. ఇందులో 1.85,348 ఎకరాల్లో విత్తనం పడింది. పంట పెరుగుదల ఆశాభావంగా ఉంది. ఈఏడాది దిగుబడి సైతం ఆరు నుంచి 10 క్వింటాళ్లు లభించే అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయి. ఇదేతరహాలో వరి దిగుబడి సైతం ఆశాజనకంగా ఉంది. గతంలో ఎకరా వరి సాగుకు 25 బస్తాలు రాగా ఈయేడాది 36 బస్తాల వరకు దిగుబడి లభిస్తుండడం ఉత్సాహాన్నిస్తోంది.

డ్రోన్ల లభ్యత ఎలా ఉంది?

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున డ్రోన్ అందించాల్సి ఉంది. మొదటి విడతలో భాగంగా 35 మందిని గుర్తించడమైంది. ఇందులో 25 డ్రోన్స్ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది.

వాతావరణ ఆధారిత బీమా వివరాలు తెలపండి?

జిల్లా వాతావరణ ఆధారిత బీమా చెల్లింపుల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలోని 1,92,047 మంది రైతులు 3,18,977 ఎకరాలకు బీమా చేశారు. ఈలెక్కన రూ.13,57,37, 744 కోట్లు చెల్లించారు.

ఇ-క్రాప్ నమోదు ఎలా ఉంది?

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కడప మొదటి స్థానంలో నిలిచింది. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణమైన 3,53,180 ఎకరాలకు 2,29, 018 ఎకరాలను ఇ-క్రాఫ్ పరిధిలోకి తీసుకుని రావడమైంది. మిగిలిన విస్తీర్ణంలోని పంటలను సైతం వేగంగా ఇ-క్రాప్ చేయడంలో నిమగ్నం కావడమైంది.

భూసార పరీక్షలపై స్పందించండి?

జిల్లాలో భూసార పరీక్షలు లక్ష్యాన్ని అధిగమిస్తాం. 2025 ఆర్థిక సంవత్సరంలో 17 వేల మట్టి శ్యాంపిళ్లను పరీక్షించాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం.ఇందులోభాగంగా ఇప్పటికే ఏడు వేల మట్టి శాంపిళ్ల పరీక్షల్ని పూర్తి చేయడమైంది.

ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప



కరపత్రాలు పంచుతున్న బండి జకరయ్య

భారత ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కడప అసెంబ్లీ కో-ఆర్డినేటర్ బండి జకరయ్య నేతృత్వంలో కొత్త బస్టాండు, పాత బస్టాండు, వై వి స్ట్రీట్, గోకులాడ్జి, అప్సర సర్కిల్ ప్రాంతాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి జకరయ్య మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజలపై అధిక పన్నుల భారం మోపుతోందని పేర్కొన్నారు. ఎంతో కీలకమైన కుల జనగణనను తగిన విధంగా నిర్లక్ష్యం చేయడం వల్ల దేశంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల ప్రస్తుత స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ప్రధాన అడ్డంకిగా మారింది అని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశ ఆస్తులను ఆదానీకి అప్పగించిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. విమానాశ్రయాలు, సముద్ర పోర్టులు, తినుబండారాల నూనెలు, సిమెంట్, బొగ్గు, రైల్వే లైన్లు, రక్షణ రంగాలు వంటి వాటిని ప్రయివేటీకరించి కార్పొరేట్ సంస్థలకు తక్కువ ధరకు విక్రయించారని ఆరోపించారు. అదనపు ప్రయోజనాలు ఆదానీకి కల్పిస్తూ సామాన్య ప్రజలపై భారం మోపడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, ఎఐసిసి కో-ఆర్డినేటర్ అబ్దుల్ సత్తార్, కుల్లాయప్ప, కదిరి ప్రసాద్ గౌడ్, సిరాజుద్దీన్, మైనుద్దీన్, పి.డి. సంజయ్ కాంత, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలల అయినప్పటికీ ఉద్యోగుల సమస్యలపై ఏ మాత్రం దృష్టి పెట్టలేదని, ఇప్పటికైనా పెన్షనర్లకు సంక్రాంతి కానుకగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ముఖ్యుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పీ.వీ. సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండగ అయిన సంక్రాంతికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు దిశగా చర్యలు తీసుకుంటుందని ఉద్యోగులందరూ గంపెడాశతో ఎదురు చూశారని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ 3వ తరగతి నుంచి సబ్జెక్టు ప్రకారం బోధన ఉండాలని, అలాగే హై స్కూల్ ప్లస్ పాఠశాలను ఏకపక్షంగా మూసి వేయడం తగదని, జూనియర్ కాలేజ్ లేని మండలాల్లోనూ అలాగే ఉంచాలని, విద్యార్థులు ఉన్నచోట కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.వి.సుబ్బారెడ్డి సిపిఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి , రామలక్ష్మి రెడ్డి, ప్రదీప్, లక్ష్మయ్య, పురుషోత్తం రెడ్డి, భాస్కర్ గుప్తా పాల్గొన్నారు.

జస్టిస్ నాగార్జునరెడ్డికి ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఫిబ్రవరి 8, 9 తేదీలలో జరగబోయే వైఎస్ఆర్ జిల్లా రచయితల మహాసభలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.వి నాగార్జున రెడ్డిని ఆదివారం వైఎస్ఆర్ జిల్లా రచయిల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్. తవ్వా వెంకటయ్య ఆయన స్వగ్రామం గడికోటలో కలిసి విశిష్ట అతిథిగా రావలసిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా వాసిగా వైయస్సార్ జిల్లా రచయితల సంఘం వారు చేసే కార్యక్రమాలు చూసి గర్విస్తున్నానన్నారు. జిల్లా ఖ్యాతిని రాయలసీమ వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర స్థాయిలో వ్యాపింప చేయవలసిన బాధ్యత తనకు కూడా ఉందన్నారు.

రూట రాష్ట్ర కన్వీనర్‌గా ముహమ్మద్ ఇర్షాద్

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ విద్యా సదస్సుల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా చింతకొమ్మదిన్నె మండలం, ఆజాద్ నగర్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముహమ్మద్ ఇర్షాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనను రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నుకున్న రూట రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అబ్దుల్ మునాఫ్,రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాఖ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వాసి రాష్ట్ర కన్వీనర్ గా ఎన్నిక కావడం పట్ల వైయస్సార్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శి కరమతుల్లా శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పిఆర్‌సి కమిషనర్‌ను నియమించి వెంటనే 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. శ్యాంసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఎపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023, జూలై నుంచే 12వపిఆర్‌సి అమలు కావాల్సివుండగా ఏడాదిన్నర గడిచినా పిఆర్‌సి కమిషన్ కార్యాచరణను ప్రారంభించ లేదన్నారు. కమిషన్ చైర్మన్ రాజీనామా చేసి 5 నెలలైనా నూతన కమిషన్ చైర్మన్‌ను నియమించలేదన్నారు.12వ పిఆర్‌సి అమలులో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటిచాలన్నారు. నూతన ప్రభుత్వం ఎర్పాటై 7 నెలలు పూర్తయినప్పటికి ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయలేదన్నారు. తెలుగు మాధ్యమంనకు అదనంగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయమోపాధ్యాయుడు పోస్టులను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లాకౌన్సిలర్లు నరసింహులు, రాజారావు, మణికుమార్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఇంద్రప్రస్థ వెంచర్, కేలెండర్, బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే 'పుట్టా'

ఇంద్రప్రస్థ ఏర్పాటు అభినందనీయం

- వెంచర్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే 'పుట్టా'


ప్రజాశక్తి - మైదుకూరు

డిటిసిపి అనుమతి కలిగిన విల్లా-ప్లాట్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ ఇంద్రప్రస్థను మైదుకూరులో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కొనియాడారు. ఆదివారం ఎమ్మెల్యే ఎంఎల్ఎన్ ఇన్ఫ్రా డెవలపర్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంద్రప్రస్థ వెంచర్ను, క్యాలెండర్ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల వసతులతో కూడిన వెంచర్ను అభివృద్ధి చేసి అందివ్వడం మంచి పరిణామమన్నారు. మైదుకూరు పట్టణానికి అన్ని వైపుల హైవేలు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రశాంత వాతావరణం, క్రీడలకు అనుగుణంగా ఆటస్థలం అందుబాటులో ఉన్న వెంచర్ ఏర్పాటు అభినందనీయమన్నారు. సంస్థ డైరెక్టర్ పెరుగు వీరనారాయణ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాదులో ఎన్నో విల్లాలు నిర్మించిన అనుభవంతో సొంత గడ్డపై నాణ్యమైన గృహాలను నిర్మించే లక్ష్యంతో 22.10 ఎకరాల స్థలాన్ని సేకరించి ఇంద్రప్రస్థ ఏర్పాటు చేశామన్నారు. 2.10 ఎకరాలలో విశాలమైన పార్కు, ఆటస్థలం, 40 అడుగుల వెడల్పు కలిగిన రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. మైదుకూరు పట్టణానికే తలమానికంగా వెంచర్ నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజ సింహ నరేంద్ర, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, చాపాడు తహశీల్దార్ రమణకుమారి, కెసి కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ డి గురివిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు మండల శాఖ అధ్యక్షులు సుధాకర్రెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకట రమణారెడ్డి, టిడిపి నాయకులు వేమారెడ్డి, వైపి సుబ్బారెడ్డి, మిల్లు శ్రీను, ప్రభాకర్ యాదవ్, లాయర్ శ్రీను, బిఎన్ శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి మేకల బాబు, ధనపాల జగన్, గోసుల కృష్ణారెడ్డి, గుత్తి వీరనారాయణ యాదవ్, కిషోర్, ఉమాకాంత్, శేషగిరి, కస్టమర్లు, ప్రజలు పాల్గొన్నారు.

తెగేందుకు సిద్ధంగా విద్యుత్ తీగ

ప్రజాశక్తి - వేముల

వేముల నుంచి బచ్చయ్యగారిపల్లె మీదుగా తహశీల్దార్ కార్యాలయం పక్కన నుంచి మీదిపెంట్లకు వెళ్లే రహదారిలో ఉన్న 11 కెవి విద్యుత్ లైన్ ఒంటిపోగుతో తెగిపోవడానికి సిద్ధంగా ఉంది. ఇది చాలా ప్రమాదకరంగా ఉందని ఆ రహదారిలో వెళ్లే రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఉన్నప్పుడు లైన్ తెగితే పెను ప్రమాదం చోటుచేసుకుంటుందని హడలిపోతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి లైన్ను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



తెగిపోవడానికి సిద్ధంగా ఉన్న 11కెవి కరెంటు తీగ

విద్యుత్ కార్మికుల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యుత్ కార్మికుల అభ్యున్నతే తమ లక్ష్యం అని తెలుగునాడు విద్యుత్ యూనియన్ పులివెందుల డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లెటి రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సింహాద్రిపురంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్న జేఎల్ఎం గ్రేడ్-2, సబ్ స్టేషన్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న డిఎస్పి మురళినాయక్

ఊరికి వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మొదటి పండుగ సంక్రాంతిని అందరం సంతోషంగా జరుపుకుందామని పులివెందుల డిఎస్పి సాకే మురళి నాయక్ కోరారు. ఆదివారం ఆయన అర్బన్ పోలీస్స్టేషన్లో విలేకరుల సమా వేశంలో మాట్లా డుతూ గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు కాక్ ఫైట్, పేకాట, మట్కాకు సంబంధించి 140 కేసులు నమోదు చేశామ న్నారు. రూ.25 లక్షల పైచిలుకు నగదును సీజ్ చేశామన్నారు. సంక్రాంతి మూడు రోజుల పండుగను సంతోషంగా ప్రజలు జరుపుకోవాలని ఆయన ఆకాం క్షించారు. రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నారాయణ ఉన్నారు.

శిల్పారామంలో ముగ్గులపోటీలకు భారీ స్పందన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా శిల్పా రామంలో నిర్వ హించిన ముగ్గు పోటీలకు భారీ స్పందన వచ్చింది. మనో హర్, శ్రీమహాలక్ష్మి ఫర్టిలై జర్స్ సహకారంతో నిర్వ హించిన ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వై.నాగలక్ష్మి, బి.శిరీష, డి.లోహిత మొదటి, రెండవ, మూడవ బహుమతులను మంగళ వారం ముఖ్యఅతిథి చేతుల మీదగా అందజేస్తారని శిల్పారామం పరిపాల నాధికారి సుధాకర్ తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్క రికి కన్సోలేషన్ బహు మ తులను మనోహర్ ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలు గంగా దేవి, అనితా, భవ్యశ్రీ, శిల్పారామ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ రాష్ట్ర జట్టుకు క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ముగ్గురు మదనపల్లె క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్-14 స్టేట్ ప్రాబబుల్స్ టోర్ని డిసెంబర్ 12 న విశాఖపట్నంలో నిర్వహించారు. ఆ స్టేట్ ప్రాబబుల్స్లో మదనపల్లె క్రికెట్ అకాడమీ, కెఎస్ఎస్ బి క్లబ్కు చెందిన ముగ్గురు క్రీడాకారులు కనబరిచిన ప్రతిభ ను గుర్తించారు. ప్రతిభ కనబర్చిన పి. హితేష్, ఎస్ఎండి శారీక్ అక్తర్, జి తేజేష్ రాష్ట్ర జట్టుకు ఎంపిక అయినట్టు కెఎస్ఎస్ బి క్రికెట్ క్లబ్ సెక్రటరీ ఖాదర్ బాబా, కోచ్లు జనార్ధన్, శివప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 27 నుండి పాం డిచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా అంతర్రాష్ట టోర్ని లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మదనపల్లి నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనందుకు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేసి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పల్లెల్లో సంక్రాంతి శోభ

నేటి నుంచి మూడు రోజులు సంక్రాంతి సంబరాలు-లోగిళ్లలో రంగవల్లులు, హరిదాసులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పల్లెల్లో పట్టణ వాసులతో సంక్రాంతి సందడి మొదలైంది. సోమవారం నుంచి సంబరాలు మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. సోమవారం బోగి, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను చేసుకోనున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఎంతో ఉత్సాహంగా ఆయా వేడుకల్లో పాలుపంచుకుంటారు. అత్యంత పెద్ద పండుగ అయిన సంక్రాంతిని సొంత ఊళ్లల్లో చేసుకోవడానికి పెద్దపెద్ద నగరాల నుంచి పల్లెలకు పయనమయ్యారు. వీరితో పల్లెలు కొత్తద నాన్ని సంతరించుకున్నాయి. రెండురోజులుగా పట్టణం నుంచి పిల్లపాపలతో పల్లెలకు చేరుకుంటున్నారు. వారి కోసం ఇక్కడున్న వారు పిండి వంటలు తయారు చేస్తున్నారు. కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు, మనవడు, మనవరాళ్లకు తమ చేతి వంట రుచులు చూపించాలని రకరకాల తినుబం డారాలు తయారు చేస్తున్నారు. ఇంటి ముందు అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలు, బసవన్నలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేక శోభను సంతరించుకుంటున్నాయి. ఉత్తరాయన పుణ్య కాలంలో మార్గశిర పుష్యమాసంలో సంక్రాంతి వస్తుంది. సూర్యుడు ఒక్కో మాసంలో ఒక్కో రాశిలోకి మారుతూ మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణం లేదా మకర సంక్రాంతిగా చెప్పుకుంటారు. సంక్రాంతి ఎన్నెన్నో సంప్రదాయాలతో ముడిపడి ఉంది. ఆధునిక పోకడలతో పండుగలో కొంత కళ తగ్గిపోతున్నా రంగవల్లులు తీర్చిదిద్దడంలో మహిళలు మాత్రం పోటీ పడుతూనే ఉన్నారు. చిన్నారులు పంతగులు(గాలిపటాలు)తో సందడి చేస్తున్నారు. సంక్రాంతిలో భాగంగా ఇళ్ల ముందు వేసే



ముగ్గుల్లో గొబ్బెమ్మలు అతి ముఖ్యమైనవి. ఆవుపేడతో ముద్దలు చేసి ముగ్గుల మధ్యన పెట్టి పసుపు, కుంకుమ అద్ది పిండితో ముగ్గులు వేసి ఏర్పాటు చేస్తారు. ఈ గొబ్బెమ్మను గౌరిదేవిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో ఆటాపాటలతో సంబరాలు జరుపుకుంటారు. పసుపు, కుంకుమ పెసరపప్పు, శనగలు, మరమరాలు (పేలాల), అటుకులు మొదలైన వాటితో పూజలు చేసి పంచుకుంటారు. భోగితో సంక్రాంతిని స్వాగతిస్తారు. ప్రతిఇంటి ముందు భోగిమంటలు వేస్తారు. పల్లెల్లో బోగి మంటల సంప్రదాయం కొనసాగుతోంది.

భోగిపండ్లతో చిన్నారులకు ఆశీర్వాదం

భోగిపండ్లు అంటే రేగు పండ్లు. సూర్యుడి రూపం రంగు పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలు కలిపి పిల్లలపై పోసి ఆశీర్వదిస్తారు. పిల్లలు కూడా ఎంతో సంబరంగా వేడుకలో పాల్గొంటారు. సాయంత్రం వేళ మహిళలు బొమ్మల కొలువు నిర్వహిస్తారు.

నోరూరించే ఘుమఘుమలు

సంక్రాంతి అంటేనే ముందుగా అందరికీ గుర్తొచేది పిండి వంటలు. నోరూరించే ఘుమఘుమలు స్వాగతం పలుకుతాయి. ప్రతి ఇంటా సకినాలు, గారెలు, అరిసెలు వంటి రకరకాల పిండి వంటలను తయారు చేస్తారు. చిన్నాపెద్ద ఎంతో ఇష్టంగా తింటారు. సంక్రాంతి పండుగ పిండివంటల్లో తెలంగాణకు ఓ ప్రత్యేకత ఉంది. బియ్యపు పిండి ప్రధాన ముడిసరుకుగా కరకరలాడే సకినాలు తయారు చేస్తారు. తెలంగాణలో సకినాల సంక్రాంతిగా చెప్పుకునే వరకు వెళ్లింది. సంక్రాంతికి పది రోజుల ముందు నుంచే సకినాలు, గారెలు, అరిసెలు, గరిజలు, మురుకులు, చేగోడిలు, లడ్డూలు, పూస, చెక్కెర పల్లీలు వంటి పిండివంటల తయారీతో మహిళలు బిజీబిజీగా కనిపిస్తారు. కనుమ రోజున నాటు కోళ్లు, గారెలు ప్రధాన వంటలుగా చేస్తారు.

కోడిపందేలు నిర్వహించేందుకు సన్నాహాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో సోమవారం నుంచి సంక్రాంతి పండుగ మొదలవుతున్న నేపథ్యంలో.. కోడిపందేలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి పులివెందుల డిఎస్పి మురళి నాయక్ను వివరణ కోరగా.. సంక్రాంతి పండగను అందరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. అలాఅని ఎవరైనా జూదం, కోడిపందేలు నిర్వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన 'ప్రజాశక్తి'కి తెలిపారు.

కోడి పందేలకు అనుమతి లేదు

పులివెందుల టౌన్ : కోడిపందేలు, గ్యాంబ్లింగ్కు అనుమతి లేదని ఎస్ఐలు నారాయణ, విష్ణు నారాయణ తెలిపారు. మండల పరిధిలోని ఇ.కొత్తపల్లిలో



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణ

ఆదివారం పోలీస్ సిబ్బంది పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ ప్రజలకు పోలీసులు హెచ్చరికలు చేశారు. పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలన్నారు. జూదం, కోడిపందేలు జరుగుతాయని బంధువులను, మిత్రులను గ్రామానికి పండుగకు పిలుస్తున్నట్లు సమాచారం వచ్చిందని అన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు అనుమతులు లేవన్నారు. ఎవరైనా అటువైపు వెళితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ఏం జరుగుతున్నా ఇదివరకు చూసీచూడనట్లు వ్యవహరించామని, ఇకపై అలా ఉండదన్నారు. కోడిపందేలు, జూదం ఆడుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐలు గ్రామస్తులను కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు : సిఐ నరేష్బాబు

ఎర్రగుంట్ల : కోడి పందేలు, పేకాట ఆడే వారిపై, నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నరేష్బాబు హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో మఫ్టీ, యూనిఫాంలో పోలీసులు గస్తీ కాస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పట్టణ, గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



అందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు నియమాలు పాటించాలని సిఐ కోరారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి




పశువుల పాకను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని శివపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మినీగోకులాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించేందుకు 10 శాతం రైతుల వాటాతో పశువుల పాకలను మంజూరు చేసిందన్నారు. మైదుకూరు మండల వ్యాప్తంగా 12 మినీ గోకులాలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరిన్ని గోకులాలను మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పశువుల పాకను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఉపాధి ఎపిఒ రామచంద్రారెడ్డి, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు భీమయ్య, చాపాడు మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్రెడ్డి, సర్పంచ్ కొండా భాస్కర్రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు నాగమోహన్, చంద్రఓబుల్ రెడ్డి, పుల్లారెడ్డి, రాజమోహన్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పశు సంపద అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని హెచ్ఎల్సి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఎర్రిపల్లి రూ.2.30లక్షలతో నిర్మించిన రెండు మినీ గోకులాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లా డుతూ పాడి రైతుల అభ్యున్నతికి నిర్మిస్తున్న మినీ గోకులాలను పశు పోష కులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి రైతులు, కోళ్ల పెంపకం దారు లకు ఈ షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్ర మంలో పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకట రామిరెడ్డి, టిడిపి గ్రామ నాయకులు జనార్ధన్రెడ్డి, కులశేఖర్రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గురజాల, పైడిపాలెం, జంగంరెడ్డి పల్లె గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పాడి రైతుల అభ్యున్నతికి నిర్మిస్తున్న మినీ గోకులాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, టిడిపి నాయకులు శ్రీధర్రెడ్డి, ఉపాధి హామీ పథకం ఎపిఒ జయభారతి, ఇసి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యుడు వాసుదేవరెడ్డి, టిడిపి జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షుడు మురళీమోహన్ యాదవ్, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని పతంగి రామన్నరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టికెఆర్ జీవన్ జీవన్ జ్యోతి హై స్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థులు కలిశారు. పిఆర్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్నవారు ఆత్మీయంగా వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. టికెఆర్ జీవన్ జ్యోతిలో 2014-15లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు వారి ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కలుసుకున్నారు.

తొండూరు : తొండూరు ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఆనందంగా జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో 45 మందికిపైగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, నాటి గురువులు పి.శ్రీరామిరెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి, టిసి గంగిరెడ్డి, డి రంగారెడ్డి, డివి కొండారెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు కెవి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు జి క్రిష్ణారెడ్డి, రమణ పాల్గొన్నారు.



జమ్మలమడుగు రూరల్ : టికెఆర్ స్కూల్లో..



జమ్మలమడుగు రూరల్ : జీవన్జ్యోతి స్కూల్లో..



తొండూరు : ఉన్నత పాఠశాలలో..



స్వామి వివేకానంద చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, శైలజానాథ్

స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత

పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రఖ్యాత భారతీయ ఆధ్యాత్మిక నాయకుడు రామకృష్ణ పరమహంస ప్రియశిష్యుడు, రామకృష్ణ మఠం వ్యవస్థాపకుడు స్వామి వివేకానంద యువతకు నిరంతర స్ఫూర్తి ప్రదాతని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత దేశాన్ని ప్రేమించి భారతీయ సమాజాన్ని జాగృతం చేశారన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను అమెరికా, ఇంగ్లాండ్ తదితర దేశాలలో చాటి చెప్పిన భారత మాత ముద్దు బిడ్డని శ్లాఘించారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రివర్యులు డాక్టర్ సాకే శైలజానాథ్, పులివెందుల అసెంబ్లీ సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డి, అనిల్కుమార్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్రెడ్డి, ఉత్తన్న, బద్రి, వేమయ్య, సుబ్బరాయుడు, వెంకటేష్, మహబూబ్ బాషా, వేమా రాజా, నాగరాజు, రవి, రమణ, వినయ్, మదార్ పాల్గొన్నారు.

శైలజానాథ్ను సన్మానించిన తులసిరెడ్డి

మాజీ మంత్రి వర్యులు సాకే శైలజానాథ్ ఆదివారం వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం నుంచి కడప మీదుగా నెల్లూరుకు వెళుతూ శైలజానాథ్ వేంపల్లెలో తులసిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా శైలజానాథ్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్ రెడ్డి, రామకృష్ణ, ఉత్తన్న, అనిల్ కుమార్ రెడ్డి, బద్రీనాథ్, నాగరాజు, మహబూబ్ బాషా, వినయ్ పాల్గొన్నారు.

ఖాజీపేట : భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దశ దిశలాచాటిన చైతన్య మూర్తి, మార్గదర్శకుడు స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు షేక్ హాజీ గౌస్, ఇస్మాయిల్, గైబు, అహ్మద్, చరిత్రకారులు షేక్ ఇంతి యాజ్ పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహావిష్కరణ

సింహాద్రిపురం : యువతకు మార్గదర్శకుడు స్వామి వివేకానంద అని మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్రెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల న్యూ క్యాంపస్ లో స్వామి వివేకానందుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో శుభదాయకమన్నారు. ఇంతటి గొప్ప కార్యాన్ని నిర్వహించడానికి విగ్రహ దాత సాయి ఎంటర్ప్రైజెస్ అధినేత గంగిరెడ్డిగారి రామాంజులరెడ్డి దాతృత్వమే ఇందుకు కారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అంబేద్కర్కు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బిజెపి అంబేద్కర్కు క్షమాపణ చెప్పాలని, కేంద్రమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి ధ్రువకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్ను ఎగతాళి చేస్తే దానికి బిజెపి ఎంపీలు నవ్వుతూ వంత పాడారన్నారు. ఇందుకోసమే దేశవ్యాప్తంగా జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. బిజెపి కుల, మతం పేరుతో రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. దేశ సంపదను బిజెపి అదానీకి దోచిపెటిందని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలను అదానీకి కట్టబెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల మండల అధ్యక్షుడు అనిల్ కుమార్రెడ్డి, తొండూరు మండలాద్యక్షులు వినోద్కుమార్ రెడ్డి, శంకరరెడ్డి, జయచంద్రారెడ్డి, సాయి, వినయ్ పాల్గొన్నారు.

ఎపి సెట్లో క్వాలిఫైని అర్హతగా పరిగణించాలి

ప్రజాశక్తి - చాపాడు

ఎపి సెట్-20024లో ఎవరైతే అర్హత సాధించారో వారిని డిఎల్-2023 నోటిఫికేషన్ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 2023 డిసెంబర్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల భర్తీ నిమిత్తం అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే డిగ్రీ అధ్యాపకుల నోటిఫికేషన్ అనేది స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించిన తర్వాత ఇవ్వవలసి ఉండగా అలా జరగలేదు. అప్పటి పరిస్థితుల కారణంగా 2022, 2023 రెండేళ్లపాటు ఎలాంటి సెట్ పరీక్ష జరగలేదు. అయితే ఫిబ్రవరి 2024లో ఎపి సెట్ ప్రకటన జారీ చేసి ఏప్రిల్ నెలలో పరీక్షను నిర్వహించారు. ప్రస్తుతం వారిని దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులుగా ప్రకటించారు. దీంతో నిరుద్యోగులు తమను అర్హులుగా గుర్తించాలని కోరుతున్నారు.

రోడ్లపై మురుగు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో రోడ్లపై మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని ఎంపిటిసి కటిక చంద్రశేఖర్, మణి గోపాల్రెడ్డి కోరారు. పాతహాల్ వీధిలో రోడ్లపై వహిస్తున్న మురుగు నీటిని ఆదివారం వారు పరిశీలించారు. కాలువల్లో చెత్తను తొలగించక పోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నట్లు ఆ ప్రాంత ప్రజలు ఎంపిటిసిల దృష్టికి తెచ్చారు. ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతున్నట్లు ప్రజలు వాపోయారు. పంచాయతీ అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించి, మురుగు నీరు రోడ్డుపై ప్రవహించకుండా చూడాలని కోరారు. పంచాయతీలో సిబ్బంది ఉన్నప్పటికీ పారిశుధ్యం మాత్రం చాలా అధ్వానంగా ఉందన్నారు. వ్యాధులు సోకకుండా పారిశుధ్య పనులను అధికారులు సిబ్బందితో చేయించాలని కోరారు.



పారిశుధ్యంపై ప్రజలను అడిగి తెలుసుకొంటున్న ఎంపిటిసిలు